సమస్యలకు పరిష్కారం చూపాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ప్రజావాణికి 91 అర్జీలు

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

మహబూబాబాద్ రూరల్ : ప్రజావాణిలో వచ్చిన వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారమార్గాలు చూపాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తాను కొనుగోలు చేసిన ఇంటిని గ్రామ పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయడం లేదని గార్ల మండలానికి చెందిన మోతుకూరి స్వరూపా రాణి వినతపత్రం అందజేశారు. కేసముద్రానికి చెందిన బానోత్ పద్మ పంట రుణ మాఫీ కాలేదని, నెల్లికుదురుకు చెందిన ప్రశాంత్, నరేశ్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, కురవికి చెందిన చంద్రకళ తనకు గ్యాస్ సబ్సిడీ అందడం లేదని వినతలు అందజేశారు. మొత్తంగా 91 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తొర్రూరు డీఎస్పీగా కృష్ణకిశోర్

ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన డీఎస్పీ కృష్ణకిశోర్

తొర్రూరు, అక్టోబర్ 28 : తొర్రూరు డీఎస్పీగా కృష్ణకిశోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సురేశ్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో కృష్ణకిశోర్ వచ్చారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్‌ను మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

ఇనుగుర్తి, అక్టోబర్ 28 : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, 5 డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నరసింహారావుకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)జిల్లా ఉపాధ్యక్షుడు సోమనర్సయ్యాచారి ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు, డీఏలతోపాటు పీఆర్సీని వెంటనే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సామల రమేశ్, జిల్లా కోశాధికారి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రంలో..

కేసముద్రం : ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, 5 డీఏలు, పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఓమ సంతోష్ ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆర్ఐ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్రీశైలం, భాస్కర్‌రావు, నర్సయ్య పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏపై విచారణ

మరిపెడ, అక్టోబర్ 28 : మండలంలోని ఎల్లంపేట వీవోఏపై ఐకేపీ డీపీఎం శ్రీనివాస్ సోమవారం విచారణ చేపట్టారు. స్థానిక మహిళలు వీవోఏ మోహర్నిషా అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదు చేయగా, స్త్రీశక్తి భవన్‌లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పూర్తిస్థాయి నివేదికను జిల్లా అధికారులకు అందిస్తానని తెలిపారు. విచారణ సందర్భంగా అక్కడికి చేరుకున్న స్థానికులు ఘర్షణపడగా పోలీసులు రెండు వర్గాలకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపిచారు.

సామాజిక తనిఖీలో అవకతవకలు

కొత్తగూడ, అక్టోబర్ 28 : కొత్తగూడ ఏజెన్సీలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి 14వ విడుత సామాజిక తనిఖీలో వివరాలను అధికారులు తప్పులతడకగా నమోదు చేసినట్లు సామాజిక తనిఖీ బృందం వెలుగులోకి తెచ్చింది. కొన్ని గ్రామాల్లో మస్టర్ల సంతకాలు లేకపోవడం, మరికొన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మించకున్నా బిల్లులు తీసుకున్నారని సామాజిక తనిఖీలో వెల్లడైంది. కాగా, గోవిందాపురం, ఓటాయి, దుర్గారం, రామన్నగూడెం, గుంజేడు, సాధిరెడ్డిపల్లి, జంగవానిగూడెం, గుండంపల్లి గ్రామ పంచాయతీల వారిగా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు రికవరీకి ఆదేశించారు. జిల్లా అదనపు డీఆర్‌డీవో శాంతకుమారి, జిల్లా అంబుడ్స్‌మెన్ ఆదామ్, ఏపీవో బీమ్లానాయక్, ఎస్ఆర్‌పీ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 28 : పెండింగ్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్ నుంచి ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే మురళీనాయక్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రాక ఇబ్బందిపడుతున్నారని, ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కలప్పుడు అనేక హామీలిచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఇంత వరకు తమ సమస్యలను పరిష్కరించలేదన్నారు. వెంటనే స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి సంవత్సరీక పాడెను కట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్య ప్రకాశ్, జ్యోతి బాస్, సింహాద్రి, రాజేశ్, వీరేందర్, చరణ్, అరుణ్, కల్యాణ్, అనిత, అఖిల పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

మహబూబాబాద్ రూరల్ : పెండింగ్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని వివేకానంద సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉన్నత చదువులకు పేద విద్యార్థులకు ఇబ్బందవుతుందని, వెంటనే స్కాలర్‌షిప్ లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోనగిరి మధు, విజయ్, సుష్మన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విపరీతమైన అసంతృప్తి పెరుగుతున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుంకరి వీరయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. హైదరాబాద్‌లో ఐదుగురికంటే ఎక్కువగా గుమికూడొద్దని, నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేయొద్దని పోలీసులు ఇచ్చిన ఆదేశాలు అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్య హక్కులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వేటు వేయాలని చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, ఆకుల రాజు, గునికంటి రాజన్న, వీరయ్య, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 28 : ఉపాధ్యాయ శాసన మండలి ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హత గల ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రీ నారాయణ అన్నారు. సోమవారం పట్టణంలో పీఆర్‌టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ నిరంతరం పనిచేస్తున్నదని, మంచి ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీ, కేజీబీవీ, గిరిజన, సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు టైం స్కేల్ తదితర సమస్యలపై పోరాటం చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు గీత, వెంకట రెడ్డి, హల్యానాయక్, లక్ష్మారెడ్డి, రామోజీనాయక్, సుజాత పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ రూరల్ : ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ ఎస్సై సునంద అన్నారు. సోమవారం పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, బాలికలు మొబైల్ ఫోన్‌లో ఫొటోల మార్పింగ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది అరుణ, పార్వతి, జయశ్రీ పాల్గొన్నారు.

మతతత్వ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 28 : మతతత్వ పార్టీలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం ఎంతో మంది విప్లవ ఉద్యమంలో అమరులయ్యారని, వారి కోసం నవంబర్ నెల ఒకటి నుంచి 9 వరకు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల ఒకటిన కంబాలపల్లి గ్రామంలో సంస్మరణ ఉంటుందన్నారు. మోదీ పాలనలో కార్మిక, కర్షకులు ఇబ్బందిపడుతున్నారని, వారి సమస్యలపై ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామపాపయ్య, మధు, లక్ష్మయ్య, కృష్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

వినూత్నంగా ఆడపిల్ల బారసాల

రూ. ఐదు నాణేలతో అలంకరణ

రూ.ఐదు నాణేలతో చేసిన అలంకరణలో పాప

మహబూబాబాద్ రూరల్,: ఆడపిల్ల పుడితే బారంగా భావించే ఈ రోజుల్లో ఓ కుటుంబం తమ పాప బారసాలను వినూత్న రీతిలో చేసింది. పట్టణంలోని కృష్ణా కాలనీలో నివాసముంటున్న ప్రశాంత్, వర్ష దంపతులకు ఆడపిల్ల జన్మించింది. ఇంటికి మహాలక్ష్మి, సరస్వతీదేవి వచ్చిందని కుటుంబ సభ్యులు సంతోషపడ్డారు. వినూత్న రీతిలో బారసాల చేశారు. బెలూన్లు, తోరణాలతో ఇంటిని అలంకరించారు. రూ.ఐదు నాణేలతో (లక్ష రూపాయాలు)ను వన్ వచ్చేలా అలంకరించి, అందులో పాపను ఉంచి సంబరంగా బారసాల చేశారు.

జాతీయస్థాయికి గిరిజన పాఠశాల విద్యార్థినులు

కురవి : హైదరాబాద్‌లో ఈ నెల 26న జరిగిన సెపక్ తక్రా(కిక్ వాలీబాల్) సీనియర్, సబ్ జూనియర్ పోటీల్లో కురవి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం బాబు తెలిపారు. సీనియర్ పోటీల్లో దీక్ష, సబ్ జూనియర్ పోటీల్లో స్వప్న, స్వాతి, దీపిక, సాయి మానస, హరిణి ఎంపికైనట్లు తెలిపారు. హెచ్‌డబ్ల్యూవో సునీత, ఉపాధ్యాయ బృందం అమర్‌సింగ్, రవి, మంగీలాల్, ధర్మీ, శ్రీను, బాలరాజు, గోవర్ధన్, నాగమణి విద్యార్థినులను అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌కు విద్యార్థిని..

కురవి: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18న జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో మొద్గులగూడెం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని రాసాల సింధూరకీర్తి ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సత్యనారాయణాచారి, ఫిజికల్ డైరెక్టర్ సునీల్ తెలిపారు. విద్యార్థినికి ఉపాధ్యాయులు లత, శ్రీరాములు, సలీం, దీపిక, ఇందిర, వీరన్న, రజిత, భాగ్యలక్ష్మి, విష్ణు, టీ రమేశ్, బీ రమేశ్, వెంకన్న, లక్ష్మ, జహేదాబేగం, వీరయ్య అభినందించారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

కేసముద్రం : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని సీపీఎం నాయకులు సోమవారం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు యాకూబ్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌లో పత్తి ధర తగ్గడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్తినేని పాపారావు, జల్లె జయరాజ్, సావిత్ర, జలేందర్, చంద వెంకన్న పాల్గొన్నారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

కేసముద్రం, అక్టోబర్ 28 : రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వేహెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపారు. రైల్వేహెడ్ కానిస్టేబుల్ కథనం ప్రకారం.. ఇంటికన్నే- నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య 416/17 కిలో మీటర్ రాయి వద్ద గుర్తు తెలియని రైలు నుంచి పడిపోయి, తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సుమారు 50 నుంచి 55 సంవత్సరా వయసు ఉంటుందని, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖానలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాల కోసం 9701747014, 8712658585 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తనకు తాను గాయపరుచుకొని ఒకరు

కేసముద్రం, అక్టోబర్ 28: మండలంలోని ఇంటికన్నే రైల్వే స్టేషన్ సమీపంలో ఇటీవల తనకు తాను గాయపరుచుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈ నెల 25న ఇంటికన్నే రైల్వే స్టేషన్‌లో బీర్ సీసా, ఇనుప రాడ్‌తో పొడుచుకొని, రాయితో తలపై కొట్టుకోవడంతో గాయాలైన వ్యక్తిని స్థానికులు మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు అసాం రాష్ట్రానికి చెందిన దుక్కుగర అనే వ్యక్తిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని ఏరియా వైద్యశాలలో భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

డోర్నకల్ : చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన తోడేళ్ల గూడెం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం... తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన గాలి కేశవులు (61) తన ఇంటి వద్ద హోటల్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 10న హోటల్ వద్ద గ్యాస్ మంట అంటుకొని 30శాతం శరీరం కాలిపోయింది. కుటుంబ సభ్యులు ఖమ్మం వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్య కోసం పలు దవాఖానలు తిప్పినా నయం కాకపోవడంతో ఇంటికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి వద్ద మృతి చెందాడు. కేశవులకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొడుకు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

కేసముద్రం, అక్టోబర్ 28 : మండంలోని బేరువాడ, నర్సింహులగూడెం ప్రభుత్వ పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి కాలేరు యాదగిరి తనిఖీ చేశారు. హాజరు పట్టిక, ప్రశ్నపత్రాలను పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా మోటివేట్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎం బీరం జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

గార్ల, అక్టోబర్ 28 : మండలంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ సమక్షంలో నిర్వహించారు. రమాదేవి సేవా ట్రస్టు సభ్యులు కౌంటింగ్ నిర్వహించగా రూ. 2,96,030 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారి సమత తెలిపారు.

పంటలకు బోనస్ ఇవ్వాలి

నెల్లికుదురు, అక్టోబర్ 28 : సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులు పంటలకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి మంజుంపల్లి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్ కార్యాలయంలో అబ్దుల్ రహమాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కులు యాకయ్య, వెంకన్న, రమేశ్, కేశవులు, రామోజీ పాల్గొన్నారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం..

తొర్రూరు, అక్టోబర్ 28 : క్రీడలతో మానసికోల్లాసంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డబుల్ బ్యాడ్మింటన్ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణకిశోర్, సీఐలు జగదీశ్, రాజు, ఎస్సైలు ఉపేందర్, రాంజీనాయక్, రాజు, క్రాంతికిరణ్, సురేశ్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

దైద వెంకన్నకు జాతీయ అవార్డు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 28 : హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయగాన సభ కళా వేదికలో హోప్ స్వచ్ఛంద సంస్థ సేవా సమితి, సింధూ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సామాజిక సేవకుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రజా హృదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్నకు డాక్టర్ నాగేశ్వరరావు, ఝాన్సీ, శాంతభాయ్ సర్దార్ వల్లబాయ్ పటేల్ అవార్డు అందజేసి, ఘనంగా సన్మానించారు.

వచ్చే నెల 6న సర్టిఫికెట్ల పరిశీలన

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 28 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వచ్చే నెల 6న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని డీఎంహెచ్‌వో మురళీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరుసటి రోజు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

జీవిత బీమా పాలసీలపై జీఎస్టీ ఎత్తివేయాలి

మహబూబాబాద్ రూరల్ : జీవితబీమా పాలసీలపై జీఎస్టీని ఎత్తేయాలని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీస్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏజెంట్లకు ఇచ్చే కమీషన్‌ను తగ్గించేందుకు ప్రయత్నిస్తోన్నదని, బోనస్ రేటును పెంచి పాలసీ దారులకు లోన్లపై వచ్చే వడ్డీరేటును తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు పాల్గొన్నారు.

విత్తన షాపులపై చర్యలు తీసుకోవాలి

కురవి, అక్టోబర్ 28 : కురవి మండలంలో నాసిరకం విత్తనాలు అందించిన షాపులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మాలోత్ కిషన్‌నాయక్ సంబంధిత అధికారులను సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాసిరకం విత్తనాలతో మండలంలోని బలపాల, రాజోలు, గుండ్రాతి మడుగు, వివిధ గ్రామాల్లోని రైతులు అధికంగా నష్టపోయారన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అనుమతి లేని షాపులు గ్రామాల్లో వెలుస్తున్నాయన్నారు. సంబంధించిన అధికారులు విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

మోటర్లకు కెపాసిటర్లు అమర్చాలి

కేసముద్రం, అక్టోబర్ 28 : మోటర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్ వృధాను అరికట్టాలని మహబూబాబాద్ ట్రాన్స్‌కో డీఈ విజయ్ అన్నారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యుత్ వినియోగంపై రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు పోతే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. వానకాలంలో విద్యుత్ స్తంభాలను పట్టుకోవద్దని, మోటర్లకు షార్ట్ సర్క్యూట్‌కు గురికాకుండా ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీ అయిలయ్య, ఏఈ రాజు, సిబ్బంది నరేశ్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ

దంతాలపల్లి, అక్టోబర్ 28 : దంతాలపల్లి మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిల్లా నిరంజన్, గౌరవ అధ్యక్షులుగా గుల్లగట్టు దాసు, పంతం సురేందర్, ప్రధాన కార్యదర్శి ఊడుగుల ఐలేష్, ఉపాధ్యక్షుడిగా అనపర్తి వీరన్న, కోశాధికారిగా మార్క వెంకన్న, సహాయ కార్యదర్శిగా పంతం విజేందర్, కార్యదర్శిగా మిడ్తాపల్లి సురేందర్‌ను ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, RAMA DEVI D (Old Name), W/O. PASHIKANTI RAVINDER, R/O. H.No. 16-04-1392, Under Bridge Road, Shivanagar, Warangal. I have changed my name as PASHIKANTI RAMYA(New Name).
NTW-446

WANTED

jobs Apply Now!

హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333978.
WGL-NT-98842

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

తనిఖీలు చేస్తున్న మార్కెట్ కమిటీ సెక్రటరీ నరేశ్, సిబ్బంది

బయ్యారం, అక్టోబర్ 28 : నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఇల్లందు మార్కెట్ కమిటీ సెక్రటరీ నరేశ్ అన్నారు. మండలంలోని కాచనపల్లి, నామాలపాడు, కిష్టాపురం, కోటగడ్డ, కొత్తపేట గంధంపల్లి గ్రామాల్లో మార్కెట్ కమిటీ సిబ్బంది సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న వ్యాపారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ..మార్కెట్ కమిటీ లైసెన్స్ తీసుకోకుండా కొందరు, పక్కమార్కెట్ కమిటీ లైసెన్స్‌తో మరికొందరు వ్యాపారులు పత్తి, మక్కజొన్న, ధాన్యం వంటి ఉత్పత్తులను నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో మార్కెట్ ఆదాయానికి గండి పడుతున్నదన్నారు. వ్యాపారులు తప్పకుండా లైసెన్స్ తీసుకొని కొనుగోలు చేపట్టాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో రంజిత్, మోహన్‌రావు, మధు, హరికృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

చదివిన స్కూల్‌లోనే

ఉపాధ్యాయ కొలువు

గార్ల, అక్టోబర్ 28 : తాను చదువుకొన్న పాఠశాలలోనే ఉపాధ్యాయ కొలువు సాధించిన గిరిజన యువకుడిని గ్రామ కమిటీలు సోమవారం ఘనంగా సన్మానించాయి. మండల పరిధిలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ కిరణ్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. తాను చిన్నతనంలో చదువుకున్న పినిరెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలో పోస్టింగ్ రావడంతో సీపీఎం, డీవైఎఫ్ఐ, రెడ్‌స్టార్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో కిరణ్‌తోపాటు తల్లిదండ్రులు భద్రు, సక్కి తమ్ముడు శ్రీకాంత్‌ను సన్మానించారు